పడమటి వైపుకు ప్రొద్దువాలి పోతోంది. చెవులు దిమ్మెక్కిపోయేలా హారను శబ్దాలు చేసుకుంటూ వెళ్తున్న వాహనాలు, వాటి నడుమ సందు చేసుకొని దూరిపోతూ పరుగులు తీస్తున్న జనసందోహం. వారి అరుపులూ... అప్పుడప్పుడే వెలుగుతున్న దీపాల వెలుతురులో సందడిగా నగరం చీకట్లను శిగలో తురుముకుంటున్న వేళ అది.




ఆ సమయంలో ఒక పార్కులో ఓమూలన దీపాల వెలుతురు పల్చగా పరుచుకున్న ఒకచోట కూర్చున్నారు. మోహన్‌రావు, మధురవాణి.

వారిద్దరిలో మోహన్‌రావు మాట్లాడుతుంటే మధురమౌనంగా వింటోంది.

"అవును మధురా నువ్వు చెప్పింది కూడా నిజమే. ప్రేమించుకున్నామన్న మిషతో బాధ్య తల్ని విస్మరించి బలాదూరుగా తిరిగే వయసు కాదు మనది. జీవితం అంటే ఏమిటో తెలిసిన మనం దేనికీ భయపడాల్సిన అవసరం లేదు. అందుకే వెంటనే పెళ్ళి చేసుకుందాం."

అని చెప్పి ఆడిగాడతను.

ఆ మాట వినగానే మధుర సిగ్గుతో మొగ్గైపో లేదు. సూటిగా అతన్ని తలెత్తి చూస్తూ, "నిజమే మోహన్ మనం వెంటనే పెళ్ళి చేసుకోవాలి. అయితే అంతకు ముందుగా మన గురించి మనం పూర్తిగా అర్థం చేసుకోవాలి"... అని మెల్లగా చెప్పిందామె.

"అంటే నీ ఉద్దేశ్యం ఇంతవరకూ మనల్ని మనం పూర్తిగా అర్థం చేసుకోలేదనా" సూటిగా ప్రశ్నించాడతను.

"అలాగని నేనడం లేదు. మనగురించి అంటే ఒకరి కుటుంబాలను గురించి మరొకరు పూర్తిగా తెలుసుకొని ఒక అవగాహనకు రావాలి. తర్వాతే ఒక నిర్ణయానికి వస్తే బాగుంటుందని"... స్పష్టంగా బదులిచ్చిందామె.

ఆ మాటాలు విని ఆమెను అర్థం చేసు కోవడానికన్నట్లుగా అతను కాసేపు మౌనం వహించాడు. . ఆ తర్వాత " సరే, అలా గైతే లేడీస్ ఫస్ట్ అంటారు కాబట్టి ముందుగా నీగురించి నువ్వు చెప్పు" ముఖాన చిరునవ్వు వులుముకుంటూ అన్నాడు మోహన్.

అతని మాటలకు మధుర తలఊపి తన గురించి, తన కుటుంబం గురించి మెల్లగా అతనికి వివరించింది.

ఆమె మాటలు విన్న తర్వాత కొద్ది క్షణా లాగి మోహన్ తన కుటుంబం గురించి చెప్పు కొచ్చాడు. ఇద్దరు వారికి ఒకర్ని గురించి, మరొకరికి పూర్తిగా అర్థం అయ్యారు.

వారిద్దరి మధ్యా మళ్ళీ ఏ సంభాషణా తలెత్త లేదు.

మోహన్ తన చేతిలోని వాచీ వంక చూసి ఇక వెళ్దామా"..అన్నాడు.

అందుకు తను కూడా సరేనంటూ తల ఊపింది.

ఇద్దరూ గడ్డిలో నుండి పైకి లేచి పార్కు బయటికి నడవటం మొదలు పెట్టారు.

"మళ్ళీ ఎప్పుడు కలుద్దాం?" నడుస్తూనే అడి గాడతను.

ఆమె జవాబు చెప్పలేదు, ఏదోలా ఆలోచిస్తు న్నట్లు మౌనంగా ఉండిపోయింది.

తర్వాత తనే చెప్పాడు "రేపు సాయంత్రం


ఇక్కడే కలుద్దాం" అని వాళ్ళిద్దరూ పార్కు గేటు దాటి రోడ్డుపై పడ్డారు.

*　　*　　*

అలా నడుస్తూనే ఇంటికి వెళ్ళి భోంచేసి నడుం వాల్చాడు మోహన్. అయితే కంటి మీద కునుకు వాలడం లేదు గానీ బుర్రనిండా ఆలోచనలు చేరి రొద పెడ్తున్నాయి.

ఒక ప్రైవేటు కంపెనీ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా మోహన్ పనిచేస్తుంటే, జూనియర్ అసిస్టెంట్‌గా మధురవాణి పని చేస్తోంది. వారిద్దరి మధ్య కాలేజీ పిల్లల్లా తొలి చూపులోనే ప్రేమ పుట్టలేదు. మూడేళ్ళ పరిచయంలో పెరిగిన ఆకర్షణ ఆరునెలల క్రితమే ప్రేమగా అంకురించింది. దాంతో వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగినా ఒకరి కుటుంబాలను గురించి ఇంకొకరు తెల్సుకోలేదు. ఆ అవసరం కూడా లేదనుకున్నాడు మోహన్. అయితే ఒకరిని గురించి ఒకరికి పూర్తిగా తెలిసిన తర్వాత తమ పెళ్ళిని గురించి అంత త్వరగా ఒక నిర్ణయం తీసుకోలేక పోతున్నాడు.

పార్కులో సాయంత్రం మధుర తన గురించి చెప్పుకున్న మాటలు అతని చెవుల్లో గింగురుమంటున్నాయి. "మా నాన్న కలెక్టర్ ఆఫీస్‌లో గుమస్తాగా పని చేసి రిటైర్ అయ్యారని నీకు తెలుసు కదా, మా నాన్నకు మేం నలుగురు కూతుళ్ళం. చివరి వాడొక్కడే మగ సంతానం. వాడిప్పుడు ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. మా అక్కల్లో మొదటి అక్క పెళ్లికి నాన్న రిటైర్ అయినప్పుడు వచ్చిన డబ్బు, ఉద్యోగం చేస్తున్నప్పుడు దాచుకున్న డబ్బు మొత్తం ఖర్చు చేయ్యాల్సి వచ్చింది. రెండో అక్క పెళ్లికి ఉన్న స్వంత ఇల్లు అమ్మేసి బాడుగింట్లోకి మారాం. అయినా ఆ పెళ్లికి చేసిన అప్పుపై వడ్డీ పెన్షన్‌లో ప్రతినెలా సగం మొత్తం మింగేస్తూంది. ఇప్పుడు నేనూ, మా చెల్లాయి మిగిలాం పెళ్ళికావడానికి. దాంతో పాటుగా తమ్ముడి చదువు బాధ్యతలు. మధుర తన కుటుంబం గురించి చెప్పడంతో పాటుగా తన చెల్లి పెళ్లి, తమ్ముడి చదువు బాధ్యతలు తనమీద ఉన్నాయని స్పష్టంగానే చెప్పింది. అందుకే మధురను పెళ్లి చేసుకుంటే తనకు వచ్చేది ఏమీ లేదు. అయితే ఆడపిల్ల తెచ్చే కట్నంపై ఆశపెట్టుకొని ఎదురుచూస్తున్న దౌర్భాగ్యుడు కాదు తను. కానీ మధురతో పెళ్లి అయిన తర్వాత తనపై అదనంగా పడే బాధ్యతలే తనను భయపెడ్తున్నాయి.




"మీ బాస్‌ని చూడాలి"
"ఎందుకు సర్"
"కొన్ని పెండింగ్ బిల్స్ వున్నాయి. వాటి గురించి మాట్లాడాలి"
"ఆయన వారం క్రితం ఊరెళ్ళారు"
"అయ్యో. ఆయనుంటారేమో ఈ రోజు మొత్తం కట్టెయ్యవచ్చనుకున్నాను"
"ఆయన వారం క్రితం ఊరెళ్ళి ఈరోజు ఉదయమే వచ్చారు"

*

మోహన్‌లో ఆలోచనలు ఎంతకీ తెగడం లేదు. దాంతో పడకపై నుండి లేచి కూర్చొని తనకు కొద్ది దూరంలో నిద్రిస్తున్న అతని తల్లి, చెల్లెళ్ళపై దృష్టి సారించాడు. అతనికి తన కుటుంబ పరిస్థితి గుర్తొచ్చింది.

తనకు ఊహ తెలిసేటప్పటికి నాన్న కరెంటాఫీసులో పనిచేసేవాడు. అయితే ఒకసారి కరెంట్‌పోల్ పైకి ఎక్కినప్పుడు షాక్ కొట్టి మరణించాడు. అప్పుడు వచ్చిన కొద్దిపాటి డబ్బును పొదుపుగా వాడుతూ అష్టకష్టాలు పడుతూనే అమ్మ తననూ, ఇద్దరు చెల్లెళ్ళనూ పెంచింది. చెల్లెళ్లను ఇంటి పనులకే పరిమితం చేసి ఇంటికి పెద్దవాడైన తనను ఎన్నో ఆశలతో చదివించింది. తను కూడా కష్టపడి చదివాడు. చదివిన చదువులకు గుర్తింపుగా ప్రభుత్వోద్యోగం లభించకపోయినా ప్రైవేట్ కంపెనీలో చేరి నెలకు పదిహేను వందలదాకా సంపాదిస్తున్నాడు. ఈ సంపాదనతో అమ్మకు అష్టైశ్వర్యాలు ఇవ్వ లేకపోయినా ఉన్నంతలో సుఖపెట్టాలని, చెల్లెళ్ళకు పెళ్ళిళ్లు చేసి తన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని ప్రయత్నిస్తూనే ఉన్నాడతను.

అదే చెప్పాడు తను మధురతో...


ఈ విషయం గురించి ఆలోచించాడతను. పెళ్ళి విషయంలో అర్ధరాత్రి దాకా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు.


అవును! తను తప్పకుండా మధురను పెళ్ళి చేసుకోవాలి. ఇక బరువులూ, బాధ్యతల విషయానికి వస్తే అవి నీడల్లాంటివి. జీవితాంతం వెన్నంటి ఉండనే ఉంటాయి. వాటికి భయపడి పరుగు తీస్తే వెంట పడి తరుముతాయి. అదే ఎదురు తిరిగి నిలిస్తే కన్పించకుండా పోతాయి. స్థిర నిర్ణయం అతని మనసులో రూపుదిద్దుకుంది. ఆ నిర్ణయంతో అతని మనసులో భారం తీరినట్లు కాగా, ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రపోయాడు మోహన్.

*　　*　　*

మామూలుగానే తెల్లారింది.

మోహన్‌రావు ఆత్రంగా టిఫెన్ తిని ఆఫీ





సుకు పరుగుపెట్టాడు. సిటీ బస్సుల్ని పట్టుకొని ఆఫీసుకు చేరేటప్పటికి ఆలస్యం అవనే అయ్యింది. అప్పటికే మధుర కూడా ఆఫీసుకు వచ్చేసింది. వాళ్ళిద్దరూ ఆఫీసులో పక్క,పక్క సెక్షన్‌లో పని చేస్తారు. అయినా అవసరానికి మించి ఎప్పుడూ ఎక్కువగా ఆఫీసులో మాట్లాడుకోరు.

ఆరోజు కూడా అదే విధంగా హలో... అంటే హలో.. అనుకున్నారు.

కాలం కాస్తా మందకొడిగానే సాగి మధ్యాహ్నం దాకా వచ్చింది.

మధ్యాహ్నం భోజనం చేస్తున్న మధురను సమీపించి మోహన్ మెల్లగా అడిగాడు.

“..సాయంత్రం వస్తున్నావా?” ... అని

అతని ప్రశ్నకామె ఎలాంటి జవాబూ ఇవ్వలేదు. మెల్లగా తల పంకించి వెళ్ళిపోయింది.

తన మనసులోని మాటను ఎప్పుడెప్పుడు చెబుదామా, అని ఎదురుచూస్తున్న మోహన్‌కు కాలం మరీ మెల్లగా సాగుతున్నట్లు అనిపించింది.

అస్తిమితంగానే సాయంత్రం దాకా పని చేశాడతను. ఇక పని ముగించి గడియారం వంక చూస్తూ పైకి లేవబోతున్న సమయంలో అటెండర్ ఒక ఫైలు తెచ్చాడు.

“ఇది అర్జెంటంట. వెంటనే చూడమన్నారు.” ... అన్నాడు ఆ ఫైలు టేబుల్‌పై పెట్టి. “ఎవరిచ్చారది?” నొసలు చిట్లిస్తూ చిరాగ్గా అడిగాడు.

“మధురమ్మగారు ఇచ్చారు!” అటెండర్ బదులిచ్చాడు.

దాంతో చిరాకు స్థానంలో ఉత్కంఠత మనసును ఆక్రమించేయడంతో అటెండర్‌ను వెళ్ళమని చెప్పి ఆత్రంగా ఆ ఫైలు తెరిచాడు.

ఆ ఫైలులో పైనే ఒక ఉత్తరం మడతపెట్టి ఉండటంతో దాన్ని చదవడం ఆరంభించాడు.

“మోహన్ గార్కి

నిన్న సాయంత్రం మనమధ్య జరిగిన సంభాషణ మనకు మంచే చేసిందని అనుకుంటున్నాను. మన కుటుంబాలను గురించి తెలిసిన తర్వాత నేనొక నిర్ణయానికి వచ్చాను. అదేమంటే మనకు పెళ్ళి అయినా మీరు మీ బాధ్యతల్ని విడిచిపెట్టలేరని నాకు అర్థం అయింది. మీకు మీ తల్లి, చెల్లెళ్ళపై ఉన్న అవ్యాజమైన ప్రేమాభిమానాలు కూడా నాకు విశదం అయ్యాయి. అదే తరుణంలో మీలాగే నాకు కూడా ఉన్న బాధ్యతలు గుర్తొచ్చాయి. మనకు పెళ్లి అయినా మీరు నా బాధ్యతలను మీవిగా గుర్తించి వాటిని నిర్వర్తించే స్థితిలో లేరు. అలాగే మీ బాధ్యతల్ని నేను కూడా పంచుకొని మీకు సహకరించే పరిస్థితిలో లేను. అందుకే మనకు పెళ్లి అయినా కష్టాలు, నిష్టూరాలు తప్ప మరేమీ మిగలదు. మనం పెళ్ళి చేసుకొని బరువుల్ని పెంచుకునే బదులు మంచి స్నేహితులుగానే మిగిలిపోదాం. ఇలా అంటున్నానని మరేమీ అనుకోకండి. మధ్యతరగతి మనసులు సమాంతర రేఖల్లాంటివి. అవి ఎన్నటికీ కలుసుకోవు. నాకు తెలియక మీ మనసు నొప్పించి ఉంటే క్షమించండి.

మీకు దగ్గరకాలేని

.. మధుర.


ఉత్తరం చదవడం ముగించిన మోహన్‌కు తలంతా దిమ్మెక్కిపోయింది. ఓ క్షణం అతను నిస్తేజంగా కూర్చుండిపోయాడు.

అయినా మధురతో మాట్లాడాలనిపించి లేచి ఆమె సీటు దగ్గరికి వెళ్ళాడు. కానీ మధుర అక్కడ లేదు. అప్పటికే ఆమె ఆఫీసు నుండి వెళ్ళిపోవడంతో మోహన్ మనసులోని శూన్యంలా ఆమె కుర్చీ ఖాళీగా కన్పించింది.

●

— ఎస్.నూర్ అహ్మద్

## తొలి టెలిఫోన్ సంభాషణ



“వాట్సన్ దయచేసి ఇక్కడకురా నీతో పని వుంది” ఇది టెలిఫోన్ ద్వారా పంపిన తొలి సందేశం. మాట్లాడిన వ్యక్తి టెలిఫోన్ కనిపెట్టిన సైంటిస్ట్ డా.అలెగ్జాండర్ గ్రాహంబెల్ కాగా ఫోన్‌కు అవతలివైపు ఈ మాటలు విన్నది గ్రాహంబెల్ సహాయకుడు థామస్‌వాట్సన్. నిజానికి అపుడు వాట్సన్ సహాయం అవసరమైనందువల్లే బెల్ అతనిని పిలిచారు. బెల్ తాను కనిపెట్టిన టెలిఫోన్ ఎలా పనిచేస్తోందో చూడాలన్న ఆతృతతో వుండగా ఆయన టేబుల్‌పై వున్న ద్రావకం ప్యాంట్‌పై పడింది. నేలపై కూడా పడింది. దాన్ని శుభ్రం చేయడానికి గ్రాహంబెల్‌కు వాట్సన్ సహాయం అవసరమైంది. వాట్సన్ ఆ సమయంలో పై అంతస్తులో ఫోన్ దగ్గర వున్నారు. యజమాని మాటలు వినగానే వాట్సన్ ఆనందంతో గంతులు వేశారు. బెల్ దగ్గరకు పరుగెత్తుకువచ్చి ఆనందంగా “మీరు కనిపెట్టిన పరికరం చక్కగా పనిచేస్తున్నద”ని చెప్పాడు. తర్వాత 1877లో “బెల్ కంపెనీ” స్థాపించారు బెల్. ఆ కంపెనీలో పదోవంతు వాటా ఇచ్చారు వాట్సన్‌కు. 1915లో గ్రాహంబెల్ న్యూయార్క్ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోలో వున్న వాట్సన్‌తో మొదటిసారి తాను మాట్లాడిన మాటలనే రిపీట్ చేస్తూ మాట్లాడారు. “39 ఏళ్ళ క్రితం మొదటిసారి ఫోన్‌లో ఏం మాట్లాడారో అవే మాటలు మాట్లాడారు. ఫోన్‌లో ఆయన గొంతు వింటూ ఆయన చెప్పిన పనిచేయడం నాకు ఆనందం. కానీ ఈసారి ఆయన చెప్పిన పనిచేయాలంటే (దూరంవల్ల) ఏడురోజులు పడుతుంది” అన్నారు నవ్వుతూ వాట్సన్. అదండీ టెలిఫోన్ సంభాషణ కథ.

సేకరణ: కలపర్తి సత్యం